# తల్లి ప్రేమకు పాత్రుడైన తనయుడే దైవానుగ్రహాన్ని పొందగలడు

**జనని గర్భమునుండి జన్మించినప్పుడు**
**కంఠమాలలవేమి కానరావు**
**మంచి ముత్యపు సరుల్ మచ్చునకును లేవు**
**మేల్మి బంగరుదండ మెడకు లేదు**
**రత్నాల హారముల్ రంజిల్లగా లేవు**
**పచ్చలు కెంపులు పొదగ లేదు**
**వజ్రాల హారముల్ వర్ధిల్లగా లేవు**
**గోమేధికంబులు తోడ లేవు**
**కలదు కలదొక్క మాల మీ కంఠమందు**
**ఎన్ని చేసిన అవియన్ని ఎంచి ఎంచి**
**మంచియైనను చెడుగైన త్రుంచకుండ**
**బ్రహ్మ మీకిచ్చి పంపును బరువు మాల**
**కర్మలన్నియు చేర్చిన కంఠమాల**

**ప్రేమస్వరూపులారా!** ఈ లోకములో బంధుమిత్రు లందరి ప్రేమకంటే తల్లి ప్రేమ ఉన్నతమైనది, అత్యంత ప్రధానమైనది. కనుకనే, స్వదేశమును మనము 'మాతృ దేశమ'ని పిలుస్తున్నాము. భారతదేశము మనకు తల్లి వంటిది. ఈ పవిత్ర దేశములో అనాదికాలమునుండి అనేకవిధములైన దివ్యశక్తులు అభివృద్ధి చెందుతూ వచ్చాయి. తల్లియందున్న శక్తి ఇంకెవరియందూ లేదు. తల్లి సంకల్పము వజ్రసంకల్పము. ఆమె సంకల్ప బలముచేతనే కుమారుడు అభివృద్ధికి వస్తాడు. తల్లి యొక్క సత్సంకల్పమును ఆధారం చేసుకొని మనము జీవితాన్ని గడిపినప్పుడు సర్వవిధములైన బాధలు నివారణై మనకు సుఖసంతోషములు కలుగుతాయి. ఏ మహనీయుని చరిత్రను మనము పరిశీలించినప్పటికీ, తల్లియొక్క ప్రేమచేతనే వారంతటి అభివృద్ధికి రాగలిగారని స్పష్టమవుతుంది. రామకృష్ణ పరమహంస మరియు ఆయనయొక్క ప్రధాన శిష్యుడైనటువంటి వివేకానందుడు తల్లియొక్క ఆశీర్వాద బలముచేతనే గొప్ప ఆధ్యాత్మిక శక్తిని సంపాదిస్తూ వచ్చారు. తల్లి యొక్క హృదయపవిత్రత, తల్లియొక్క ఆశీర్వాద బలము సాటిలేనివి. కాని, ఈనాటి మానవుడు మాతృమూర్తి యొక్క ప్రేమతత్త్వమును సరిగా అర్థం చేసుకొనలేక పోతున్నాడు. ఆధ్యాత్మిక మార్గమునందు తల్లికి ప్రథమ స్థానము అందించబడింది. వేదము, 'మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ, అతిథిదేవో భవ' అని బోధించింది. మనము ఏ దేవతను పూజించినప్పటికీ, పూజించకపోయినప్పటికీ తల్లిని మాత్రం పూజించాలి. ఎవరిని గౌరవించినప్పటికీ గౌరవించకపోయినప్పటికీ తల్లిని గౌరవించాలి. తల్లి గౌరవాన్ని నిలబెట్టినవాడే నిజమైన పుత్రుడు. మాతృప్రేమకు పాత్రుడు కానట్టి పుత్రుని జీవితం నిరర్థకం. తల్లిని గౌరవించి, తల్లి ప్రేమను నిలబెట్టుకున్నప్పుడే మనము నిజమైన మానవులమవుతాము. కాబట్టి, ప్రతి ఒక్కరూ తల్లిని గౌరవించాలి; తల్లిని ప్రేమించాలి; తల్లికి ఉన్నత స్థానమును అందించాలి. అటువంటి వ్యక్తులే దేశానికి నాయకత్వము వహించగలరు.

తల్లిని మించిన దైవము లేదు. కాని, మానవులు తల్లిని విస్మరించి దైవముకోసం అటూ ఇటూ తిరుగుతూ కాలమును వ్యర్థం చేస్తున్నారు. దైవమును దర్శించే నిమిత్తం జపములు, తపములు, తీర్థయాత్రలు, వ్రతములు, పూజలు మొదలైనవి ఎన్నియో చేస్తున్నారు. కంటికి కనిపించని దైవముకోసం ప్రాకులాడే బదులు కంటికి కనిపించే ప్రత్యక్ష దైవమైన తల్లిని మనం పూజించాలి, సేవించాలి. తల్లి ప్రేమకు నోచుకోకుండా మానవుడు దైవప్రేమకు, దైవానుగ్రహానికి పాత్రుడు కాలేడు. తల్లియొక్క ప్రేమ స్వార్థరహితమైనది. అది అంతర్భావములో ప్రవహించేటటువంటిది. అట్టి స్వార్థ రహిత ప్రేమను తల్లిదగ్గరనుండి మనం అలవరచుకోవాలి. తల్లి ప్రేమకు మనం అర్పితం కావాలి. తల్లి హృదయము చాలా విశాలమైనటువంటిది. అట్టి హృదయానికి మనం బాధ కలిగించకూడదు. తల్లిని నొప్పించి మనం ఏ పనీ చేయకూడదు.

మాతృప్రేమను విస్మరించి ఇతరుల ప్రేమకోసం ప్రాకులాడడం వెఱ్ఱితనం. తల్లి అనేక శ్రమలకోర్చి, పిల్లలను పోషిస్తూ, చదివిస్తూ వుంటుంది. పిల్లల కోసం అవసరమైతే తాను కూలి పనైనా చేయడానికి సిద్ధపడుతుంది. అట్టి మాతృప్రేమను మరచిపోవడం ఎంత ద్రోహము! మాతృప్రేమను మనం ఎన్నటికీ మరువరాదు. తల్లి ప్రేమచేతనే పిల్లలలో దివ్యమైన భావములు అభివృద్ధి అవుతాయి. గుణవంతురాలైన తల్లి ఎక్కడ ఉంటుందో అక్కడ అన్నివిధములుగా సుక్షేమము, సౌభాగ్యము కలుగుతుంటాయి. రామకృష్ణ పరమహంస తల్లి గొప్ప గుణవంతురాలు. ఎన్ని కష్టనష్టములు సంభవించినప్పటికీ ఆమె దైవముపై అచంచలమైన భక్తి, విశ్వాసములు కలిగియుండి, సద్భావములతో, సత్కర్మలతో కాలము గడుపుతూ తద్వారా దైవానుగ్రహానికి పాత్రురాలైనది.

**తల్లియే దైవము, దైవమే తల్లి**

మీరు ఏ మహనీయుని చరిత్రనైనా తీసుకోండి, వారి గొప్పతనము తల్లి ప్రేమనుండి ఆవిర్భవించినదే! తల్లి ప్రేమను సాధించినటువంటివాడు సర్వమును సాధించగలడు. తల్లి ప్రేమకు పాత్రుడైనాడు కనుకనే రామకృష్ణ పరమహంస గొప్ప పేరు సాధించినాడు. లేకపోతే, బెంగాల్ రాష్ట్రంలో ఎంతమంది గొప్పవారు లేరు! ఎంతమంది ధనవంతులు లేరు! ఎంతమంది విద్యావంతులు లేరు! కాని, భగవంతునిపట్ల భక్తి, విశ్వాసములు లేకపోవడంచేత వారు జీవితములో విజయము సాధించలేకపోయారు. రామకృష్ణునికి పరిపూర్ణమైన భక్తి, విశ్వాసాలుండడంచేతనే తల్లిని ప్రేమించి, తల్లియొక్క ఆజ్ఞను శిరసావహించి ఆదర్శ ప్రాయమైన జీవితాన్ని గడుపుతూ వచ్చాడు. తల్లి ప్రేమ కంటే మించినది జగత్తులో లేదని ప్రబోధిస్తూ వచ్చాడు. తల్లియే దైవం, దైవమే తల్లి. అట్టి ప్రేమస్వరూపురాలైన తల్లిని కష్టపెట్టడం మంచిది కాదు. తల్లి ప్రేమను మనము అభివృద్ధిపరచుకున్నప్పుడే మన జీవితము నిత్యకల్యాణం, పచ్చతోరణంగా కళకళలాడుతుంది. తల్లి ఏమి చేసినప్పటికీ మన మంచికోసమే చేస్తుంది గాని, చెడ్డకోసం చేయదు. కాబట్టి, తల్లి కొట్టినా, తిట్టినా సహించాలి. మాతృప్రేమకోసం హృదయ పూర్వకంగా కృషి చేయాలి. మాతృప్రేమ ఎల్లప్పుడు మన ఇంటనే, వెంటనే, జంటనే, కంటనే ఉండి మనల్ని కాపాడుతుంటుంది. కాని, దానిని మనం కనిపెట్టుకో లేకపోతున్నాము. మనం భూమినుండి ఉద్భవించలేదు; ఆకాశమునుండి ఊడిపడలేదు; తల్లి గర్భమునుండే జన్మించినాము. కాబట్టి, తల్లిపట్ల కృతజ్ఞత చూపాలి. తల్లిని ద్వేషించే కుమారులున్నారుగాని, కుమారుని ద్వేషించే తల్లులు లేరు. తల్లి ఎల్లప్పుడు కుమారుని యొక్క సుక్షేమాన్నే కోరుతూ వుంటుంది. ఒక్కొక్కసారి తల్లీ కుమారులమధ్య అభిప్రాయ భేదాలు తలెత్తవచ్చు. అంతమాత్రముచేత తల్లి కుమారుని ద్వేషించదు. కోర్టుకు వెళ్ళినప్పటికీ తల్లి, "ఇతను నా కుమారుడు" అని చెప్పుకుంటుంది; కుమారుడు, "ఈమె నా తల్లి" అని చెప్పుకుంటాడు. తల్లీ పిల్లలమధ్య గల ప్రేమ సంబంధము అంత గాఢమైనది. తల్లి నిరంతరము తన పిల్లల యోగక్షేమాలనుగురించే పాటుపడుతుంటుంది. అట్టి మాతృప్రేమను విస్మరించడంచేతనే మానవుడు అనేక అవస్థలకు గురి అవుతున్నాడు. తల్లి ప్రేమను సాధించండి; సర్వుల ప్రేమను మీరు సాధించగలరు. "ఆ ముసలమ్మకు ఇంత కూడు పెడితే సరిపోతుంది", అనే సంకుచిత భావములో మునిగిపోవద్దు. తల్లికి ఇంత తిండి పెట్టడంతో మన బాధ్యత తీరిపోయిందని భావించడం పొరపాటు. తల్లిని సేవించాలి. ఆమెను సంతోషపెట్టాలి. భగవంతుడు మన ఎదుట ప్రత్యక్ష మైనప్పటికీ తల్లిదండ్రుల సేవను విడిచిపెట్టకూడదు.

**పుండరీకుని ఆదర్శం**

పుండరీకుడు వృద్ధులైన తన తల్లిదండ్రుల సేవయే తనకు ప్రధానమని భావించాడు. ఒకనాడతను తన తల్లిదండ్రులకు పాదసేవ చేస్తున్నాడు. తల్లిదండ్రులపట్ల పుండరీకునికి గల ప్రేమను పరీక్షించదలచి పాండు రంగడు ప్రత్యక్షమయ్యాడు. కాని, పుండరీకుడు ఆయన వైపు చూడకుండా తన తల్లిదండ్రుల సేవలో నిమగ్ను డయ్యాడు. పాండురంగడు, 'నాయనా! నేను నీకు దర్శనం ఇవ్వడానికి వస్తే నీవు నన్ను చూడకుండా ఎవరికి సేవ చేస్తున్నావు?' అని అడిగాడు. 'నా తల్లి దండ్రులకు నేను సేవ చేస్తున్నాను స్వామీ', అన్నాడు పుండరీకుడు. 'తల్లిదండ్రులకంటే దైవము గొప్ప కదా! నన్ను ఒక్కసారి దర్శించవా?' అన్నాడు పాండురంగడు. "నాకు తల్లిదండ్రులే

ప్రత్యక్ష దైవాలు. నా తల్లిదండ్రులు నిద్రించేంతవరకు నిన్ను దర్శించడానికి వీలుపడదు. నీవు నాకు దర్శనమివ్వాలనుకుంటే అంతవరకూ  ఈ ఇటుకపై నిలుచో," అని చెబుతూ పుండరీకుడు ఒక ఇటుకను విసిరాడు. అప్పుడు పాండురంగడు పుండరీకుని మెచ్చుకుంటూ, "నాయనా! నీ అంతటి మాతృభక్తి, పితృభక్తి అందరికీ ఉంటే జగత్తు ఎల్లప్పుడు సుక్షేమంగా, సౌభాగ్యవంతంగా ఉంటుంది. నీవంటి సత్పుత్రులు లోకములో అభివృద్ధి కావాలి", అన్నాడు.

**బాల గాంధీకి తల్లి నేర్పిన గుణపాఠం**

పుత్లీబాయి ఒక నియమాన్ని పాటించేది. కోయిల కూత వినకుండా ఆమె భోజనం చేసేది కాదు. గాంధీ పసివానిగా ఉన్నప్పుడు ఒకరోజు మధ్యాహ్నం మూడు గంటలైనప్పటికీ తల్లి భోజనం చేయకుండా ఉండడం గమనించి, తాను ఇంటి వెనుకకు పోయి కోయిల మాదిరి కూత పెట్టాడు. వెంటనే లోపలికి వచ్చి, "అమ్మా! కోయిల కూసింది కదా! ఇక, నీవు భోజనం చేయవచ్చు," అన్నాడు. తన కుమారుడు అబద్ధం చెబుతున్నాడని గ్రహించి ఆ తల్లి పట్టలేని కోపంతో గాంధీని చెవిపట్టి యీడ్చి రెండు చెంపదెబ్బలు కొట్టింది. "నీలాంటి అసత్యవాది నా గర్భంలో పుట్టడం నా దురదృష్టం," అంటూ చాలా బాధపడింది. అప్పుడు గాంధీ పశ్చాత్తాపపడి తన తప్పును మన్నించ వలసిందిగా తల్లిని ప్రార్థించాడు. ఇక జీవితములో ఎన్నడూ తాను అసత్యమాడనని ప్రతిజ్ఞ చేశాడు. ఈవిధంగా, ప్రాచీన కాలంలో తల్లులు తమ పిల్లలకు సరియైన బుద్ధులు నేర్పి, వారిని సన్మార్గంలో ప్రవేశ పెట్టడానికి ఎంతో కృషి సల్పుతూ వచ్చారు. అటువంటి ఆదర్శప్రాయులైన తల్లులు ఈనాడు లోకంలో చాలా అరుదుగా ఉన్నారు. "నా కుమారుడు పరీక్షలో గొప్ప మార్కులు సంపాదించాలి; గొప్ప డిగ్రీలు తీసుకోవాలి; గొప్ప ఉద్యోగం చేయాలి; లక్షలు సంపాదించాలి", అని ఆశించే తల్లులు నూటికి నూరుమంది ఉన్నారుగాని, "నాయనా! నీవు దైవప్రార్థన చేయి. దైవాన్ని మరువ వద్దు", అని పిల్లలకు బోధించే తల్లులు ఎక్కడా లేరు. అందువల్లనే భారతదేశము కష్టాలతో క్రుంగిపోవలసి వచ్చింది. భారతీయులు నిరంతరం "రామా, కృష్ణా, గోవిందా" అని ఎంతో ఆనందంగా దైవచింతన చేస్తూ కాలమును గడిపేవారు. కాని, ఇప్పుడు అటువంటి పవిత్రమైన చింతన నిలిచిపోయి లౌకికమైన చింతలు బయలుదేరినాయి. దైవాన్ని ప్రేమించండి. కేవలం ప్రపంచాన్ని ప్రేమిస్తూ కూర్చుంటే ప్రయోజనం లేదు. భారతీయ సంస్కృతి 'సత్యం వద, ధర్మం చర' అని ప్రబోధించింది. కాని, ఈనాడు జరుగుతున్నదేమిటి? "సత్యం వధ, ధర్మం చెఱ", సత్యాన్ని వధిస్తున్నారు; ధర్మాన్ని చెఱసాలలో పెడుతున్నారు.

**ఆదర్శప్రాయులు ఆనాటి తల్లులు**

ఒక పర్యాయము ఈశ్వరమ్మ నాదగ్గరికి వచ్చి, "స్వామీ, అనేకమంది బీదతల్లులు తమ పిల్లలను తీసికొని వచ్చారు. వారికి తినడానికి సరియైన తిండి లేదు. వారిని ఆశీర్వదించండి", అని కోరింది. నేను వారికి తగిన సహాయం చేసి ఆమె మనోభీష్టాన్ని నెరవేర్చాను. మరో రోజున ఈశ్వరమ్మ వచ్చి,   "స్వామీ, మన గ్రామంలోని చంటిబిడ్డలు మూడు  మైళ్ళు నడచి బుక్కపట్నం స్కూలుకి వెళుతున్నారు. అంతదూరం వెళ్ళి వాళ్ళు ఏమి చదువుకోగలరు?"  అని బాధ పడింది. నేను ఆ పిల్లల తల్లిదండ్రులను పిలిచి, 'చిన్నచిన్న పిల్లలకు స్కూల్లో టీచర్లు చెప్పే విషయాలకంటే ఇంట్లో తల్లి బోధించే విషయాలే హృదయానికి హత్తుకుంటాయి. మీ పిల్లలను అంతదూరం పంపించే బదులు మొట్టమొదట మీకు తెలిసిన చదువేదో వారికి బోధించండి. మీకు తెలిసిన రెండు మూడు అక్షరాలైనా పిల్లలకు నేర్పించండి", అని చెప్పాను. తరువాత, ఈ గ్రామంలోనే ఒక స్కూలు కట్టించి ఈశ్వరమ్మ కోరికను నెరవేర్చాను.

ఈ దేహము విద్యార్థిగా ఉన్నప్పుడు ఒక పర్యాయం కొందరు రాజకీయ నాయకులు నాదగ్గరికి వచ్చి, "రాజూ! నీవు మంచి కవిత్వం రాస్తావట. మేమొక మీటింగు ఏర్పాటు చేసుకున్నాము. నీవు మనవారికి మంచి ఉత్తేజం కలిగించే పాట ఒకటి వ్రాయాలి", అని కోరినారు. ఆ సమయంలో హిట్లరు చాలా ఉద్రేకంగా ఉండినాడు. రష్యా తదితర దేశాలను జయించాలని ప్రయత్నం చేశాడు. అప్పుడు నేను ఒక చిన్న డ్రామా రూపొందించాను. ఆ డ్రామాలో ఒక రబ్బరు బొమ్మను ఒక ఊయలలో వేసి ఊపుతూ ఒక పాట పాడాను:

**ఏడువకు పసిబాల ఏడువకు తండ్రీ!**
**ఏడిస్తే నిను భరతవీరుడనరయ్యా...జో...జో**
**హంతకుడు హిట్లరు అమర రష్యాపై**
**దండెత్తి వచ్చెనని జడిసి ఏడ్చితివా...జో...జో**
**హిట్లరును చంపుటకు ఎర్రసైన్యంబు**
**వీరుడౌ స్టాలిను కలరు ఏడువకు...జో...జో**

**ఇంకెందుకుర నాన్న అట్టులేడ్చెదవు**
**ప్రజలకైక్యత లేదటంచు ఏడ్చితివా**
**ఐక్యతగ ప్రజలంత చేరి పోరాడి**
**స్వాతంత్ర్యమును పొందగలరు ఏడువకు ...జో... జో**

పిల్లలకు చిన్నతనమునుండియే దేశభక్తిని, దైవభక్తిని బోధిస్తూ వారిని ఆదర్శప్రాయులుగా తీర్చిదిద్దుతూ వచ్చారు, ఆనాటి తల్లులు. వారి మాటల్లో అసత్యానికి తావుండేది కాదు. సత్యవాక్కులచేత తమ పిల్లలను సత్యమార్గములో ప్రవేశపెడుతూ వచ్చారు. ఈనాడు భారతదేశంలో ఇట్టి పవిత్రమైన బోధనలు నిలిచి పోయినాయి. ఆనాటి తల్లులు ఏమీ తెలియని అమాయకులైనప్పటికీ, నిరక్షరాస్యులైనప్పటికీ దైవ ప్రార్థనను మాత్రం వాళ్ళు ఎన్నడూ మానలేదు. ప్రాచీన కాలమునుండి భారతీయ స్త్రీలు దైవప్రార్థన చేస్తూ రావడంవల్లనే దేశము ఉత్తమస్థితికి చేరుకోగలిగింది.

**ఆరోగ్య, ఆనందాలకు దైవానుగ్రహం ప్రధానమైనది**

ప్రేమస్వరూపులారా! మీరుగాని, మీకు పుట్టబోయే బిడ్డలుగాని పవిత్రులు కావాలంటే మీరు దైవచింతన చేస్తూ రండి. తల్లిదండ్రులు మంచిగా ఉంటేనే పిల్లలు మంచివారుగా పుడతారు. మన భారతదేశాన్ని ప్రాచీన కాలమునుండి ఆదర్శప్రాయులైన తల్లిదండ్రులే పోషించుకుంటూ వచ్చారు. కాని, ఈనాడు తల్లి దండ్రులు సరియైన ఆదర్శాన్ని అందించకపోవడంచేత పిల్లలు పెడమార్గం పడుతున్నారు. పూర్వము తల్లులు తమ పిల్లలకు సద్బోధలు సల్పుతూ, సదభ్యాసములను అలవరచుతూ వచ్చారు.

**"కొక్కొరొకోయని కోడి కూయగనే**
**చక్కగా నిద్రమంచమునుండి లెమ్ము**
**పలు దోముకొని దేహబాధ దీర్చుకొని**
**జలకమాడి దుస్తులు ధరించి చల్ది భుజించు**
**హితమైన వస్తువు ఎంతయు నమిలి**
**మితముగ భుజించిన మేలగు నీకు**
**బడికేగి శ్రద్ధగా పాఠముల్ నేర్చి**
**అణకువ గల బాలుడనిపించుకొనుము**
**తేమలో నెప్పుడు తిరుగంగబోకు**
**మురికిగుంటల చెంత పోబోకుమెపుడు**
**పరుగుడు చెడుగుడు బంతులాటయును**
**సరియైన వేళల సలుపుచునుండు**
**పైరీతుల న్నీవు పరిగణింతువేని**
**ఆరోగ్యభాగ్యంబు లనుభవించెదవు"**

అని తమ పిల్లలకు బోధించేవారు. ఈనాడు పెద్దలు, పిల్లలుకూడను పళ్ళు శుభ్రంగా తోముకోవడం లేదు. కనుకనే, రోగాలన్నీ మననుండియే పుడుతున్నాయి. మంచిగాని, చెడ్డగాని మనమే తెప్పించుకుంటున్నాము గాని, వాటంతట అవి రావడం లేదు. ఈ దేహానికి ఏడవ సంవత్సరం జరుగుతున్న సమయంలో పుట్టపర్తి గ్రామంలో కలరా, ప్లేగువంటి అంటువ్యాధులు ప్రబల మవుతూ వచ్చాయి. కలుషితమైన నీరు త్రాగడంవలన, అపరిశుద్ధమైన ఆహారాన్ని భుజించడంవలన ఇలాంటి వ్యాధులు వ్యాపిస్తాయని నేను పిల్లలను హెచ్చరిస్తూ వచ్చాను. "నీటిని పరిశుభ్రం చేసుకొని త్రాగండి. కొంచెమైనా ఫరవాలేదు, పరిశుద్ధమైన ఆహారాన్ని మాత్రమే స్వీకరించండి. అంతేగాదు. మీ నోటినికూడా పరిశుభ్రంగా ఉంచుకోండి. అపరిశుభ్రమైన నోటివలన అనేక వ్యాధులు సంక్రమిస్తాయి. ఆకలైనప్పుడు ఏది చిక్కితే అది భుజించడం మంచిది కాదు. ఆరోగ్యానికి, ఆనందానికి దైవానుగ్రహము ప్రధానమైనది. కాబట్టి, దైవప్రార్థన చేయండి", అని వారికి బోధిస్తూ వచ్చాను. ఆనందమనేది ఒక్క దైవచింతనచేతనే లభిస్తుందిగాని, మరి దేనివల్లను లభ్యం కాదు. ఇది బయటినుండి సంపాదించేది కాదు; మన హృదయమునుండియే ఆవిర్భవిస్తుంది. ఆనందాన్ని, ఆరోగ్యాన్ని అనుభవించే నిమిత్తం దైవచింతనచేత మన కాలాన్ని సార్థకం గావించుకోవాలి, హృదయాన్ని పవిత్రం చేసుకోవాలి. ఎవ్వరినీ అనుకరించకూడదు.

మన హృదయమునుండి ఆవిర్భవించే సత్యాన్ని మనం విశ్వసించాలి. ఒక కులమువారు మరొక కులాన్ని, ఒక మతమువారు మరొక మతాన్ని ద్వేషించడం మంచిది కాదు. ఎవరి మతాన్ని వారు అనుసరించాలి. ఏ రూపంలోనైనా సరే, దైవాన్ని ప్రార్థించి, దైవానుగ్రహముచేత మనం పవిత్రులం కావాలి. చిత్తశుద్ధితో చేసే ప్రార్థనను భగవంతుడు తప్పకుండా ఆలకించి, అనుగ్రహిస్తాడు.

**మంచి భావములు గలవాడే యువకుడు**

మనలో పవిత్రమైన భావాలను నింపుకున్నప్పుడు మనం మంచి ఫలితములనే పొందుతాము. మంచి భావాలు ఏర్పడాలంటే మంచి అభ్యాసాలను అలవరచు కోవాలి. అట్టి యువకులే ఈనాడు దేశానికి అవసరం. యువకులంటే ఎవరు? పద్దెనిమిది, ఇరవై ఏళ్ళు వచ్చినవాళ్ళు యువకులని మీరు భావిస్తున్నారు. కాదు, కాదు. మంచి భావములు గలవాడే 'యువకుడు' అనే పదానికి అర్హుడు. తెల్లవారి లేచిన తరువాత మొట్ట మొదట 'రామా, కృష్ణా, గోవిందా...' అంటూ భగవన్నామాన్ని స్మరించాలి. రాత్రి పడుకునేముందు కూడా భగవన్నామస్మరణ చేయాలి. భగవన్నామాన్ని స్మరిస్తే మనకు అన్నీ భగవద్భావములే కలుగుతాయి. కాని, ఈనాడు మనం దైవచింతనను పూర్తిగా మరచి పోయినాము. ఏదో గొప్ప చదువులు చదువుతున్నామని భావిస్తున్నాము. కాని, ఈ చదువులు మనలను సరియైన మార్గంలో త్రిప్పడం లేదు. మనలో వివేక విచారణను పెంపొందించని Education (విద్య) Agitation (ఆందోళన)కు దారితీస్తుంది. అసలు Education అంటే ఏమిటి? కేవలం గ్రంథాలు చదవడం కాదు. గ్రంథాలు చదవడంవలన లభించేది 'బుకిష్ నాలెడ్జ్'. అది కృత్రిమమైనది. నిజమైన జ్ఞానం మన హృదయము నుండియే ఆవిర్భవిస్తుంది. యువకులు ఈ సత్యాన్ని గుర్తించి, సరియైన ప్రచార ప్రబోధలు సల్పినప్పుడు దేశము ఎంతైనా బాగుపడుతుంది.

**"నేను దైవాన్ని, నీవుకూడా దైవానివే"**

ప్రేమస్వరూపులారా! ప్రాకృతమైన చదువులు గొప్పవని భావించి కాలమును వ్యర్థం చేయకండి. దైవనామాన్ని స్మరింపజేసే చదువును మనం చదవాలి. 'బుకిష్ నాలెడ్జ్'తో సంతృప్తి చెందకండి. అది కేవలం 'సూపర్‌ఫీషియల్ నాలెడ్జ్' మాత్రమే. మనకు ప్రధాన మైనది ఆత్మజ్ఞానము. దానిని సంపాదించడానికి కృషి చేయండి. అది మన లోపలినుండే ఆవిర్భవిస్తుందిగాని, బయటినుండి లభించదు. నది ఒడ్డున ఇసుకను తోడే కొలదీ నీరు వస్తుంది కదా! అదేవిధంగా, మనలో ఉన్న దుర్భావాలను తీసివేసేకొలదీ పవిత్రమైన జ్ఞానము, పవిత్రమైన భావములు మనలోనుండి ఆవిర్భవిస్తాయి. పవిత్రత, నిశ్చలత్వము, జ్ఞానము ఇవన్నీ హృదయము నుండియే ఆవిర్భవిస్తాయి. మీరందరూ ముఖ్యంగా సత్సంకల్పాలను అభివృద్ధిపరచుకోవాలి. పవిత్రమైన మార్గాన్ని అనుసరించాలి. ఎవరేమి అనుకున్నప్పటికీ మీరు లెక్కచేయనక్కర్లేదు. వారి మాటలకూ, వీరి మాటలకూ విలువనిచ్చి మీ పవిత్ర భావాలను పాడు చేసుకోకూడదు. ప్రాచీనకాలంలో తల్లులు తమ పిల్లలకు ఇటువంటి పవిత్రమైన బోధనలు చేస్తూ వచ్చారు. అందుచేతనే, ఆనాటి పిల్లలు నిరంతరము దైవచింతన చేస్తూ వుండేవారు. కనుకనే, దేశము దైవముయొక్క సంరక్షణలో నిలిచిపోయింది. దేహము కాదు మనకు ముఖ్యము; భావము చాలా ముఖ్యము. పవిత్రమైన దైవభావములు మనలో ఆవిర్భవించాలి. "ఎక్కడున్నాడు భగవంతుడు?" అని చాలామంది ప్రశ్నిస్తుంటారు. నేను చెబుతుంటాను, "నాయనా! I am God, you are also God ", అని. ఈ సత్యాన్ని వెల్లడించడానికి మనం ఎందుకు భయపడాలి! నేను దైవాన్ని. నీవుకూడా దైవానివే! భగవంతుడు సర్వుల యందు ఉంటున్నాడు. అందరూ దైవస్వరూపులే! ప్రతి మానవునియందు దైవత్వముంటున్నది. మనలో దైవత్వమే లేకపోతే మనము ఈ జగత్తునందు ఉండలేము. దైవవిశ్వాసమువల్లనే మనము ఈ ప్రపంచములో ఈనాటివరకు ఉండగలుగుతున్నాము.

ఒక ఊర్లో ఇరువురు భార్యాభర్తలుండేవారు. భార్య నిరంతరం భగవన్నామాన్ని స్మరిస్తూ, పూజలు చేస్తూ వుండేది. కాని, భర్త మాత్రం భగవన్నామస్మరణగాని, పూజలుగాని చేయకుండా తన పనేదో తాను చేసుకుంటూ వుండేవాడు. "అయ్యో, నా భర్త ఒక్క నాడైనా 'రామా, కృష్ణా' అని ఉచ్చరించడం లేదే!", అని భార్య చాలా బాధపడుతూ వుండేది. ఒకనాటి రాత్రి నిద్రపట్టక అటూ ఇటూ దొర్లుతూ అతను 'రామా', అన్నాడు. భర్త నోటినుండి ఆ మాట రావడం విని భార్య ఎంతగానో పొంగిపోయింది. తెల్లవారి లేస్తూనే ఆమె ఇంట్లో ఉన్న బియ్యమునంతా వండి, బీదవారికి అన్నదానం చేసింది. అది చూసి భర్త, "ఏమిటే? ఇంట్లో ఉన్న బియ్యమునంతా వండి పేదలకు పెడుతున్నావు. ఏమిటీ రోజు విశేషం?" అని అడిగాడు. "నిన్నటి రాత్రి మీనోటి నుండి 'రామా' అనే పదాన్ని నేను విన్నాను. అది విని నా హృదయం ఉప్పొంగిపోయింది", అన్నది. "అయ్యో, ఇంతకాలం నేను రాముణ్ణి నా హృదయంలో పదిలంగా దాచుకున్నాను. నా రాముడు నాలోనుండి బయటికి వెళ్ళిపోయాడా!" అని అతను చాలా బాధ పడ్డాడు. చాలామంది తమ భక్తిప్రపత్తులను బయటికి వ్యక్తం చేయరు; హృదయంలోనే దాచుకుంటారు. కాని, ఏదో ఒకనాటికి అది బయట పడిపోతుంది.

ప్రేమస్వరూపులారా! దైవనామాన్ని స్మరించండి. మీకు ఏ నామము ఇష్టమో ఆ నామాన్ని స్మరించవచ్చు. రామకృష్ణ పరమహంస తల్లి తన కుమారునికి సద్బోధలు సల్పి అతనిని గొప్ప యోగిగా మార్చ గలిగింది. తల్లులందరూ ఆమెను ఆదర్శంగా తీసికొని తమతమ పిల్లలను సన్మార్గంలో ప్రవేశపెట్టడానికి కృషి చేయాలి. భగవన్నామాన్ని స్మరించుకుంటూ ఉంటే అదే మీలోని భావాలను పరిశుద్ధం చేస్తుంది. భగవన్నామాన్ని ఎన్నటికీ మరువకండి. భగవన్నామాన్ని స్మరిస్తూ వుంటే మీ జీవితం తప్పక ధన్యమవుతుంది.

**(తేదీ 06.05.2005 సాయంత్రం 'సాయిశ్రుతి', కొడైకెనాల్‌లో శ్రీవారు అనుగ్రహించిన దివ్య సందేశము నుండి)**